క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో చెరువులో పూడికతీత పనులను శుక్రవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు, చెరువుల పూడికతీత, సాగునీటి కాల్వల మరమ్మతు పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఆయన సిబ్బందికి సూచించారు. పనులను నిబంధనల మేరకు చేపట్టాలన్నారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రం పరిశీలన



కొత్తకోట: మండలంలోని కనిమెట్టలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక శుక్రవారం పరిశీలించారు. ఆధార్ కార్డులో ఇంటి నంబర్‌తో పాటు 12ఏళ్ల వయస్సు దాటిన పిల్లలు ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేయించుకోవడంతో పాటు అడ్రస్ మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, రాంచంద్రయ్య, మల్లేష్, కురుమూర్తి, మన్యంకొండ, భాస్కర్, శివ తదితరులు ఉన్నారు.

రూ.5లక్షల చెక్కు అందజేత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో సోమవారం వీరసముద్రం చెరువు ప్రమాదంలో మరణించిన చిన్నారుల కుటుంబ సభ్యులు గందం కురుమన్నకు శుక్రవారం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును తహసీల్దార్ మురళి, సర్పంచ్ సత్యంయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కురుమన్న, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, మాజీ సర్పంచ్ బజార్ అన్న, వార్డుసభ్యుడు రమేష్, వెంకటేష్, మదిలేటి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల పోస్ట్ కార్డు ఉద్యమం



ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్, గ్రామీణ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తమ సమస్యలను పరిష్కరించాలని వీఓఏలు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. శుక్రవారం 26వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక పోస్టాఫీస్‌లో ఉత్తరాలను పోస్ట్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, పల్లవి, ధనుంజయ్‌గౌడ్, మాధవి, శ్రీలత, అనురాధ, జయమ్మ, ఉమాదేవి, తిరుపతమ్మ, రమేష్, రఘు, ఇంద్రావతి, పద్మ, కురుమూర్తి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని 15వ వార్డులో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు స్థానిక కౌన్సిలర్ ఖాజాతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులుగా నీటి సమస్య ఉందని కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సిబ్బందిని పిలిచి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ పైపులు లీకేజీ కావడంతో వాటిని గుర్తించిన కమిషనర్ వెంటనే సరిచేయాలని సిబ్బందికి సూచించారు. పట్టణంలో డ్రెయినేజీలను తీయించడంతో పాటు వీధిలైట్ల సమస్య లేకుండా చూడాలన్నారు.

సమావేశానికి హాజరుకావాలి

కొల్లాపూర్: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా కొల్లాపూర్‌లోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థాయి టీడీపీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగిడాల శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం నిర్వహించనున్న సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు నేతలు హాజరవుతారని తెలియజేశారు.

సంబురంలా సీఎం కప్ పోటీలు

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల15 నుంచి 17వ తేదీ వరకు సీఎం కప్ వేసవి క్రీడా పోటీలను సంబురంలా నిర్వహించాలని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, జెడ్పీటీసీ డాక్టర్ శివరంజని, వైస్ ఎంపీపీ కోటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సింధూజ, ఏఎస్‌ఐ బీచుపల్లి, ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 13, 14 వ తేదీల్లో ఆసక్తి ఉన్న క్రీడాకారులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలకు దరకాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీరేశలింగం, పీఈటీలు సంతోషి, అశోక్, రమేష్, అంబేడ్కర్, వాలీబాల్ కోచ్ ఖాదర్, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు

గోపాల్‌పేట: కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీపీ సంధ్య, మండల అధికారులు ప్రకటించారు. శుక్రవారం వారు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ చీఫ్ మినిస్టర్ ఆటల పోటీల్లో భాగంగా అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. 15 ఏళ్ల నుంచి 36 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనే విధంగా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 14లోపు వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ ఉసేనప్ప, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ బంగారు శ్రీనివాసులు

ఏఎన్ఎం, నర్సుల సేవలు వెలకట్టలేనివి



వనపర్తిలో నర్సులను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరిన వారికి సేవ చేసే నర్సుల సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ.. ప్రార్థించే పెదవుల కన్న సహాయం చేసే చేతులు మిన్నా అన్న మాటకు నర్సులు నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో పని చేస్తున్న మాణిక్యమ్మ, లక్ష్మి, ఎస్తేర, రాణి, సౌజన్య, నిర్మల, నిరంజనమ్మ, చంద్రకళ, ఉషారాణి తదితరులు 10మంది నర్సులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు నరేంద్రకుమార్, రామారావు, ప్రభాకర్ రావు, రాజకుమార్, బంగారయ్య, డప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మండలంలోని దంతనూరులో శుక్రవారం సర్పంచ్ శ్రావణి ఆధ్వర్యంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎంలు చంద్రమ్మ, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, కావేరిని పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నర్సులు ముందుండి ప్రజలకు సేవాలందించారని కొనియాడారు.



దుప్పల్లిలో..

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడొచ్చు

గోపాల్‌పేట: ఏదైనా ప్రమాదంలో వ్యక్తి గుండె ఆగిపోతే సీపీఆర్ చేయడం ద్వారా ఆ వ్యక్తి గుండె మళ్లీ కొట్టుకునే విధంగా చేసి ప్రాణాలు నిలపొచ్చని మెడికల్ ఆఫీసర్ మంజుల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె సీపీఆర్ చేసే విధానాన్ని చూపించారు. ప్రమాదం జరిగినప్పుడు గుండె ఆగిపోతే 30 సెకన్ల పాటు ప్రెస్ చేసి నోటి ద్వారా గాలిని అందించాలని సూచించారు. అంబులెన్స్ వచ్చే వరకు ఇదే ప్రక్రియ చేయాలని సమీపంలో ఆస్పత్రి ఉంటే తీసుకువెళ్లాలని అన్నారు. ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవడంతో పాటు వారి పక్కవారికి సైతం సీపీఆర్ గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ ఉసేనప్ప, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మంజుల

రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి అందించాలి



ఖిల్లాఘనపురంలో సమ్మె చేస్తున్న వీఆర్ఏలకు మద్దతు తెలుపుతున్న నాయకులు



మదనాపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: దేశానికి రాజ్యాంగ గ్రంథం దిక్సూచి అని, దేశాన్ని నడిపిస్తున్న ఈ గ్రంథాన్ని దేశంలోని ప్రతి పౌరుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ సభ్యులు ఈశ్వర్, బలరాం, యాదయ్య తదతరులు అన్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఏసయ్యకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం అక్కడే సమ్మె చేస్తున్న వీఆర్ఏలకు వారు మద్దతు తెలిపారు. తమ సమస్యలపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నేరవేర్చే వరకు సమ్మె చేపడతామని ప్రతి ఒక్కరూ తమకు మద్దతు ఇవ్వాలని వీఆర్ఏలు కోరారు. మద్దతు తెలిపిన ధర్మ సమాజ్ పార్టీ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాశన్న బాలయ్య, కృష్ణయ్య, నగేష్, నరసింహ్మ, అంజనేయులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: దేశాన్ని నడిపిస్తున్న రాజ్యాంగాన్ని దేశంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వం ఉచితంగా పంచాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు సుధాకర్, ఈశ్వర్, ఎల్లయ్య, కురుమయ్య, నరేష్, మనితేజ శుక్రవారం తహసీల్దార్ నరేందర్‌కు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు పూర్తిస్థాయిలో రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. చెట్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎంపీపీ మేఘారెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అమ్మపల్లికి అనుబంధ గ్రామమైన కావలి గుడిసెలు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు శుక్రవారం అంగరంగ వైభవంగా ఏర్పాటు చేశారు. వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ప్రతిష్ఠాపన కార్యక్రామాన్ని ఆలయ ఉత్సవ కమిటీ భక్తిశ్రద్ధలతో దిగ్విజయంగా నిర్వహించింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవానికి రూ.1.20 లక్షలు విరాళంగా అందజేసిన ఎంపీపీ మేఘారెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మేఘారెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, రాంచంద్రయ్య, తిరుపతిరెడ్డి, యాదయ్య, బాలు, శేఖర్ రెడ్డి, నాగన్నయాదవ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

మండలస్థాయి ఆటల పోటీలు

కొత్తకోట: మండల స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ పోటీలను ఈనెల 15నుంచి 17వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ రవీందర్‌బాబు, ఎంఈఓ కృష్ణయ్య, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెంటిక్స్ 100మీటరు, 400 మీటర్లు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు పురుషులు, మహిళలు పంచాయతీ కార్యదర్శుల వద్ద తమ పేర్లను 13వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇవ్వడంతో పాటు జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండల పీఎస్‌లో గురువారం రాత్రి మైనర్ బాలిక మిస్సింగ్ కేసు నమోదయినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండల కేంద్రానికి చెందిన బాలకిష్టమ్మ, బుచ్చయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈనెల ఎనిమిదిన తల్లిండ్రులు పొలం పనులకు వెళ్లి.. తిరిగి సాయంతం ఇంటికి వచ్చి చూసే సరికి కుమార్తె కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో తల్లితండ్రులు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన యోగా శిబిరం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని న్యూ టౌన్ కాలనీలోని పార్కులో ప్రారంభించిన 15డేస్ చిల్డ్రన్ వేసవి యోగా శిబిరం గురువారం రాత్రి ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేసి ఎస్ఎస్‌వై యోగా గురువు ప్రేమలత పేర్కొన్నారు. ఈ మేరకు పిల్లలకు యోగా, సూర్య నమస్కారాలు, ధ్యానం, నీతి కథలు, శ్లోకాలు, ఆటలు మొదలగు అంశాలను నేర్పించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పిల్లలకు వేసవి సెలవుల్లో యోగా ద్వారా మంచి విషయాలు తెలిపినందుకు యోగా గురువు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ప్రేమలత మాట్లాడుతూ.. సమ్మర్ హాలీ డేస్‌లో సెల్ ఫోన్, టీవీలతో కాలక్షేపం గడపకుండా ఉండేందుకు 15 రోజులు యోగా తరగతులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈనెల 24 నుంచి 15 రోజులు రెండో విడత చిల్డ్రన్ వేసవి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



ఆత్మకూర్: చిట్టెం రామన్న యువసేన ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జాతరమైదానంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, మాజీవార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 62 జట్లు పోటీల్లో తలపడుతున్నాయని, మొదటి బహుమతి సాధించే జట్టుకు రూ.50వేలు నగదు, షీల్డు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25వేలు నగదు, షీల్డు, ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు హరీష్, రఘు, కమల్, క్రీడాకారులు ఉన్నారు.

మసీద్ కమిటీ నాయకులకు సన్మానం

కొల్లాపూర్: జామెమసీద్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజాదావుష్, యాసిన్‌లను శుక్రవారం ముస్లింలు సత్కరించారు. ఇటీవల నూతన కమిటీని ముస్రష్ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. కొల్లాపూర్ పట్టణంలోని మసీదులన్నింటినీ అభివృద్ధి చేసేందుకు మావంతు ప్రయత్నం చేస్తామన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అధికారులు సందర్శించారు. 'తూకాల్లో మోసాలు' అని సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఐకేపీ అధికారులు కేంద్రంలో ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాల నమోదు రికార్డులను, కేంద్రంలోని ధాన్యాన్ని వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా త్వరగా కాంటా చేయాలని రైతులు కోరడంతో కొన్ని ప్రైవేటు కాంటాలను తీసుకొచ్చి తూకాలు చేశామని.. అలా చేసిన సమయంలో తూకంలో కొంత తేడా జరిగిందని ఆ వెంటనే ప్రైవేటు కాంటాలను తీసివేశామని తెలిపారు. ప్రస్తుతం రైతులకు నష్టం జరగకుండా బస్తా 41 కేజీలు ఉండేలా తూకం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ బాలశివుడు, గ్రామ మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రికార్డును పరిశీలిస్తున్న సీసీ బాలశివుడు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ తేజస్‌నందులాల్

వనపర్తి టౌన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన సిద్రా సుల్తాన్, సాయి రిషికేష్, రోహిత్, 9.8 సాధించిన సుమన్విత, శివశంకర్, హంసిని, 9.0 సాధించిన 10 మంది రాక్‌వుడ్స్ స్కూల్ విద్యార్థులను గురువారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు అధిక మార్కులు సాధించడానికి ప్రయత్నించాలి కానీ.. మార్కులు తక్కువ వస్తే మనస్తాపానికి గురి కాకుండా రెట్టించిన పట్టుదలతో ప్రయత్నించాలని సూచించారు. విద్యాసంస్థలో విద్యతో పాటు నైతిక విలువలు, సమాజం పట్ల అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



అమరచింతలో నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏలు

అమరచింత: ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం వీఆర్ఏలు సమ్మె నిర్వహించారు. రాష్ట్ర వీఆర్ఏల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఒక్కరోజు సమ్మె కార్యక్రమాన్ని నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈమేరకు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మహిమూద్, మునిస్వామి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలకు ప్రమోషన్ కల్పించడంతో పాటు పే స్కెల్ అమలు పర్చాలని కోరారు. చనిపోయిన వీఆర్ఏల కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నారాయణ, రాజశేఖర్, అర్జున్, గాయత్రి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఈత నేర్పించాలి



ఈత సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగన్న

పాన్‌గల్: చిన్నారులు సరదాగా ఈతకు వెళ్తుంటారని అలా వెళ్లనీయకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఈత నేర్పించాలని ఎస్‌ఐ నాగన్న తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో చిన్నారులు, యువత ఈత పడుతున్న బావి దగ్గరికి ఎస్‌ఐ సిబ్బందితో పరిశీలించారు. ఈత పడుతున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈత సరదా మాటున ప్రమాదం పొంచి ఉంటుందనే విషయం గమనించి పెద్దల పర్యవేక్షణలో ఈత నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఒంటరిగా బావులు, చెరువులు, కుంటల వద్దకు ఈతకు పంపొద్దని పెద్దల సహాయంతోనే ఈతకు వెళ్లాలన్నారు.

వరి గడ్డిలో పోషకాలు అనేకం

- వంట వ్యర్థాలను కాల్చొద్దు
- పశుగ్రాసంగా వాడుకుంటే మంచి ఫలితం

పాడి-పంట

అధికారి సలహా: వినయ్‌కుమార్, పశువైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్

మాగనూర్: యాసంగిలో వేసుకున్న వరిపంట కోతలు పూర్తి కావొచ్చాయి. వరి కోతల అనంతరం గడ్డిని పాడి పశువుల పోషణకు పశుగ్రాసంగా ఏడాది వరకు నిల్వ చేసుకునే వీలుంది. పాడిపశువులకు సాధారణంగా వరిగడ్డిని పశుగ్రాసంగా అందించడం మనకు తెలిసిందే. కొంత మంది రైతులు ఇటీవల కాలంలో యంత్రాల ద్వారా కోతలు చేసి గడ్డిని పొలాల్లోనే వదిలేస్తున్నారు. అనంతరం పంట వేసే సమయంలో పొలంలో కాల్చుతున్నారు. దీంతో భూమికి మేలు చేసే కొన్ని కీటకాలు చనిపోతున్నాయి. భూసారం కూడా తగ్గుతుందని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ వరిగడ్డి లోంచి 40 నుంచి 50 శాతం శక్తిగా మార్చబడి పశువు జీవక్రియలకు ఉపయోగపడుతుంది. వరిగడ్డి నిల్వ, వాటిలో లభించే ప్రొటీన్ల అవశ్యకతను మాగనూర్ పశు వైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్ వివరిస్తున్నారు.

తయారీ విధానం

- పశుగ్రాసాలకు ఎంచుకున్న వరిగడ్డిలో పోషకాల స్థాయిని పెంచేందుకు యూరియా మంచి ఫలితాలిస్తుంది. 100 కిలోల వరిగడ్డికి 4 కిలోల యూరియా నీటితో తడిపి ఇరవై రోజుల మాగాక వాడుకోవచ్చు.
- ముందుగా తయారికీ ఎంచుకున్న ప్రదేశాన్ని బాగా శుభ్రం చేసి పాలిథిన్ సంచులను కానీ పట్టా కానీ పరచాలి. 60 లీటర్ల నీటిలో 4 కిలోల యూరియా కలిపి, కర్రతో పూర్తిగా కరిగేలా కలపాలి. శుభ్రం పరిచిన వరిగడ్డిలో 1/4 వంతు గడ్డిని పాలిథీన్ సంచిపై పరిచి, తయారు చేసిన యూరియా నీళ్లను పూర్తిగా తడిచేలా చల్లాలి. మరల ఒక పొర వరిగడ్డి పరిచి, మళ్లీ యూరియా నీళ్ల చల్లాలి.



ట్రాక్టర్‌లో వరి గడ్డిని తీసుకెళ్తున్న రైతులు

- పొరల వారీగా వరిగడ్డి పరుస్తూ యూరియా నీటితో గడ్డి తడిచేలా చల్లుతూ సమారు 20 రోజులు గాలి తగలకుండా, మాగబెట్టాలి. అనంతరం ఈ మాగుడుగడ్డిని, మామూలు పశుగ్రాసాలతో కలిపి పాడి పశువులకు మేపడానికి అలవాటు చేయాలి.
- బూజుపట్టిన లేదా తెగుకు సోకిన వరిగడ్డిని ఉపయోగించరాదు. మాగిన గడ్డికి 15 నిమిషాలు గాలి తగిలనిచ్చిన తర్వాతే మేపాలి.
- యూరియాతో మాగిన గడ్డిలో 6 శాతం మాంసకృత్తులు ఉండి, పశువు శరీర బరువు పెరుగుదల 2.2 శాతం ఉంటుంది. మాగిన గడ్డి తీయగా, రుచికరంగా ఉంటుంది. కాబట్టి పశువులు ఇష్టంగా తింటాయి. ఎక్కువ భాగం జీర్ణం కాగలదు కాబట్టి పశువుల్లో జీవక్రియ సాఫీగా ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి



రైతులు, పశు కాపారులు పైన సూచించబడిన సలహాలు, సూచనలు పాటించాలి. దీనివలన వారికి ఇబ్బందులు ఉండవు. పశువులు కూడా ఆరోగ్యకారంగా ఉంటాయి.

– వినయ్‌కుమార్